కథ

# మనసుకి కళ్ళాలు

వెనక ఎవరో తరుముతున్నట్టే, హడావిడిగా గజానికొక అంగ చొప్పున వేసుకుంటూ ముందుకి కదులుతోంది ఇంద్రాణి. ఒక చేతిలో స్కూల్ బేగ్...మరో చేతిలో ఆరేళ్ళ వికాస్. తల్లి పరుగుతో పోటీ పడలేని వికాస్ అప్పటికే ఏడుపుమొహం పెట్టేగాడు.

''మమ్మీ! కాళ్ళు లాగుతున్నాయి'' అన్నాడు ఆయాసపడుతూ.

ఇంద్రాణికి అసహనంగా అనిపించింది. చెయ్యెత్తి రిస్ట్ వాచ్‌కేసి చూసుకుంది.

ఎనిమిదీ పది!

ప్రేయర్ మొదలు కావడానికీ, స్కూల్ గేట్ మూసెయ్యడానికీ ఇంకా ఇరవై నిమిషాలుంది. స్కూలు కూడా ఇంకెంతో దూరం లేదు.

కాస్సేపు ఆగి...బాబుని ఒక క్షణం స్థిమిత పడనిచ్చి ఆ తర్వాత మెల్లగా నడిపించుకుంటూ తీసుకు వెళ్ళినా స్కూల్ చేరుకోవడానికి ఐదు నిమిషాల కంటే ఎక్కువ పట్టదు. అయినా ఆమెకి ఆగ బుద్ధి కాలేదు. ఆలస్యం చెయ్యకుండా వికాస్‌ని ఎత్తుకుంది. మళ్ళీ పరుగులాంటి నడకతో స్కూల్ వైపు కదిలింది.

సరిగ్గా మూడే మూడు నిమిషాల్లో బాబుతో సహా ఆమె స్కూల్ గేట్ ముందుంది. అక్కడ వాణ్ణి దించి పుస్తకాల బేగ్ బాబు భుజానికి తగిలించి రిలీఫ్‌గా నిట్టూర్చింది.

''టాటా మమ్మీ!'' చెప్పేసి గేట్లోంచి లోపలికి

> 'ఎందుకిలా అతనికోసం అతని పరిచయం కోసం వెంపర్లాడుతోంది తను, పరిచయం పెరిగాకా ఏం చేస్తుంది? మాట్లాడుతూ...మౌనంగా మనసులోనే అతన్ని ఆరాధిస్తూ మూగగా ఉండిపోతుందా! లేక అందరి కళ్ళూ గప్పి హద్దులు దాటి ఇంకెంత దూరమైనా వెళ్ళిపోతుందా?

వెళ్ళిపోయాడు వికాస్.

ఆమె కూడా చెయ్యి ఊపింది

కానీ ఆమె చూపులు మాత్రం గేట్లోంచి లోపలికి దూసుకుపోయి మొత్తం పరిసరాల్ని చుట్టేస్తున్నాయి.

ఆ కళ్ళలో...ఎవరి కోసమో అన్వేషణ...ఆ వ్యక్తి దర్శనభాగ్యం కోసం అంతులేని ఆరాటం.

ఒకటి..రెండు...

క్షణాలు గడిచిపోతున్నాయి.

సరిగ్గా మూడో క్షణంలో ఆమె చూపులల్లిన వలలోకి ఠీవిగా ఎంటరయ్యాడతను.

బ్లాక్ కలర్ పాంట్ మీద క్రీమ్ కలర్ షర్ట్ టక్ చేసుకున్నాడు.

ఆరడుగుల పొడవు..ఎత్తుకు తగ్గ లావు..బంగారానికి తావి అబ్బినట్టుగా ఆకృతికి తగ్గ రాజసం...అసలు మగాడంటే ఎలా ఉండాలని ఆడాళ్ళంతా కలలు కంటారో..ఎలా ఉండాలని కోరుకుంటారో అచ్చంగా అలాగే ఉన్నాడతను.

ఆ స్కూల్‌లో సరిగ్గా ఆరే ఆరు నెలల క్రితం ఫిజికల్ డైరెక్టర్‌గా జాయినయ్యాడు.

మొదట్లో ఇంద్రాణికి ఏమీ అనిపించలేదు.

కానీ రాన్రానూ ఎందుకో అతన్ని చూసినప్పుడల్లా ఆసక్తి పెరగసాగింది. వీలైనప్పుడల్లా సాధ్యమైనంతగా అతన్ని పరిశీలించడం ప్రారంభించింది. అది క్రమంగా ఏ రోజూ అతన్ని చూడకుండా ఉండలేని స్థితికి చేరుకుంది.

ఆ బలహీనతలోని భాగమే ప్రస్తుతం ఆమె కళ్ళలోని భావాలు!

అతను కనపడగానే..యుగాల తరబడీ జరుగుతున్న అన్వేషణ ఫలించినట్టుగా ఆమె కళ్ళలో కోటి మెరుపులు మెరిశాయి.

మనసు మబ్బు తునకలా తేలిపోయింది.

అతన్ని కళ్ళ నిండుగా చూసుకుంది. తృప్తిగా నిట్టూర్చింది.

ఇక చూపులు మరల్చుకుని వెనుతిరగాలనుకుంటూండగా...

అతను ఆమెని గమనించాడు.

ఒక్కక్షణం...

ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

ఆమె కళ్ళలోని భావాల్ని గమనించినట్టుగా అతను నవ్వాడు.

అచ్చంగా వెన్నెల్లో పొన్నలు విరిసినట్టూ..శరద్యామినిలో పారిజాతాలు కురిసినట్టూ!

ఇంద్రాణికి గుండె ఝల్లుమంది. ఒళ్ళంతా పులకలు తేలింది. ఇంకా ఇంకా అతన్నలాగే చూస్తే బావుండునని మనసు గోల చేస్తున్నా వినకుండా బలవంతాన అక్కణ్ణుంచి కదిలింది.

ఇంద్రాణి మనసంతా పరవశంతో నిండిపోయింది. ఒళ్ళంతా వెయ్యి ఏనుగుల బలంతో ఉంది.

ఆ పూట ఆమెకి ఏమీ తినాలనిపించలేదు. ఏం తినకపోయినా ఆకలి లేదు. నీరసం అంతకంటే లేదు.

లోలోపల ఏదో ఉత్సాహం.

ఎంతెంతో ఉత్తేజం!

అదంతా కేవలం అతని వల్లనే అని తెలుస్తూనే వుంది.

అసలామాటకొస్తే...అతన్ని చూడకపోతే, అతను ఒక్కరోజు స్కూల్‌కి రాకపోతే తన మనసంతా అదోలా ఏదోలా అయిపోతుందని కూడా తెలుసు.

అన్నీ తెలిసినా ఏమీ చెయ్యలేని అశక్తత!

ఏం చెయ్యలేకపోయినా అందులోనే అంతులేని తృప్తి.

ఇది దాదాపు ఐదు నెలలుగా ఆమె మనసులో జరుగుతున్న అంతర్మథనం!


ఉదయం లేవడం...ఎనిమిదిన్నరకి బాబుని స్కూల్లో దించేస్తూ పన్లోపనిగా అతన్ని చూసి రావడం...మధ్యాహ్నం బాబుకి లంచ్ బాక్స్ తీసుకు వెళ్ళి అతని కోసం ఆరాటపడడం...మళ్ళీ మూడున్నరకి బాబుని స్కూల్ నించి తెస్తూ అతనికి మనసులోనే వీడ్కోలు పలకడం...ఆదివారం వచ్చినా, స్కూల్‌కి ఏదయినా అకేషనల్ హాలిడే ఇచ్చినా విలవిల్లాడిపోవడం..

ఇవన్నీ ఇంద్రాణి దిన చర్యలో భాగాలయిపోయాయి.

రోజులు గడిచిపోతున్నాయి.

ఓరోజు అనుకోని సంఘటన జరిగింది.

ఆరోజు...అతను ఇంద్రాణిని చూసీ చూడగానే పలకరింపుగా నవ్వాడు. అక్కడితో ఆగకుండా నాలుగే నాలుగు అంగల్లో గేటు దగ్గర



నిల్చున్న ఆమెని సమీపించాడు.

''హలో!'' అన్నాడు చనువుగా.

దగ్గరగా వచ్చేసి పలకరిస్తున్న అతని చొరవకీ, చనువుకీ ఆమె ఆశ్చర్యపోయింది. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి పోయింది. అతని పలకరింపుతో గుండె దడదడలాడుతుంటే..ఏ జవాబూ చెప్పలేక పరుగులాంటి నడకతో ఇంటికొచ్చిపడింది.

ఆ క్షణంలో ఆమె మనసు ఉవ్వెత్తున ఎగసిపడే కడలి అలే అయింది. కొండ కొమ్ము నుంచి హోరున దూకుతున్న జలపాతంలా కదిలిపోయింది.

ఏవిటీ అలజడి?

ఎందుకింత పరవశం?

ఆ ప్రశ్నలు ఆమె చాలాసార్లే వేసుకుంది.

కానీ దేనికీ జవాబులు దొరకలేదు. కనీసం..అది తప్పో? ఒప్పో అని ఆలోచించేంత స్థిమితం కూడా ఆమె మనసుకి లేదు.

కానీ..ఆ క్షణంలోనే ఆమె ఒక స్థిర నిశ్చయానికి వచ్చేసింది.

'ఏదో ఒకలా రేపు అతనితో మాట్లాడాలి. ఎలాగోలా పరిచయం పెంచుకోవాలి' అని! అలా

**అగస్త్యప్రగడ హేమంత**

అనుకుంటూ ఉంటే..అప్పుడు ఆమె మనసు తేలిక పడింది.

మర్నాడు...

రోజూ కంటే ఓ పది నిమిషాల ముందే బాబిగాణ్ణి తీసుకుని స్కూల్‌కి బయల్దేరింది.

ఆమె వెళ్ళేసరికి అతను స్కూల్ గేటు దగ్గరే నిలబడి ఉన్నాడు. ఆమె కోసమే ఎదురు చూస్తున్నాడు.

ఇంద్రాణి కనపడగానే అతని కళ్ళు మెరిశాయి!

''గుడ్ మార్నింగ్!'' అన్నాడు.

ఆమెకి వింటేనే ఏమనాలో తోచలేదు.

''మమ్మీ! టాటా!'' బాబిగాడు చెయ్యూపుతుంటే చూపుల్ని వాడి మీదకి మరల్చి బదులిచ్చింది.

''పేరేమిటీ?'' అడిగాడతను.

''ఇంద్రాణి?'' చెప్పింది.

''మీ పేరు కాదు...మీ బాబు పేరు...'' అన్నాడు. ఆ అనడంలో ఒకింత కొంటెతనం..అతని కళ్ళల్లో అదోరకం అ..ల్ల..రి!

చూస్తున్న ఆమెకి తెలుస్తూనే ఉంది. అతను కావాలనే తనని ఆటపట్టిస్తున్నాడని.

"వాడి పేరు...వికాస్!" చెప్పింది తడబడుతూ!

"చాలా బావుంది" అతని స్వరంలో మెచ్చుకోలు.

"అవును! ఆ పేరు నేనే పెట్టాను" గర్వంగా అంది.

"బావున్నది మీ బాబు పేరు కాదు..మీ వాయిస్" మళ్ళీ అతని గొంతులో అల్లరి.

ఇంద్రాణికి గుండె ఆగినంత పనయింది.

మనసు మూలల్లో ఆనందంతో కూడిన కోపం...ఒకలాంటి తియ్యని ఉక్రోషం...

ఆ క్షణంలో...చనువుగా అతని మీద పడి...తన మెత్తని పిడికిళ్ళు బిగించి..సుతిమెత్తగా..అతని ఛాతీమీద మోదాలన్నంత అద్భుతమైన ఆవేశం ఆమెని పట్టి కుదిపేసింది.

చుట్టూ ఎవరూ లేకపోతే ఆమె ఆ పనే చేసేదేమో! బలవంతాన మనసుని స్వాధీనంలోకి తెచ్చుకుని ఇక వెళ్ళడం కోసమన్నట్టుగా వెనక్కి తిరిగింది.

"మళ్ళీ రేపు కలుద్దామా!" వెనక నుంచి..మేఘాల రాపిడిలా అతని స్వరం...ఆమె మనసుని శాసిస్తోంది.

"తప్పకుండా..." చప్పున అనేసి గబగబా అక్కణ్ణుంచి వచ్చేసింది.

ఆ సంఘటనతో ఆమె మనసు మొత్తం మైకం కమ్మేసింది. గాల్లో తేలిపోతున్నట్టనిలా ఇంటికి చేరుకుంది. కలల్లో జోగుతూ ఇంట్లోకి అడుగు పెట్టింది.

ఆమె ఒంట్లోని పులకరింతలు ఇంటికి చేరుకున్నా తగ్గలేదు.

"ఏవిటింత ఆలస్యం? త్వరగా బాక్స్ సర్దు. ఆఫీస్‌కి టైమవుతోంది" గుమ్మంలో అడుగుపెట్టిన ఇంద్రాణి చెవుల్ని చేరాయా మాటలు! అవి ఆమె భర్తవి.

ఆ మాటల్తో ఆమె ఊహల చెల్లాచెదురయ్యాయి.

ఆలోచనలు ఆగిపోయాయి.

వాస్తవం గుర్తొచ్చింది.

కళ్ళెత్తి భర్తవైపు వెర్రిగా చూసింది. ఆ చూపుల్లో 'ఇంట్లో ఈయనొకరున్నారు కదూ! మర్చేపోయాను సుమా!' అన్న భావం!

'ఇంట్లో భర్తని పెట్టుకుని, కొడుకుని స్కూల్లో దింపడానికి వెళ్ళి నేను ఆలోచిస్తున్నదేమిటి?' అనుకుంటూంటే ఆమెకి ఎబ్బెట్టుగా అనిపించింది.

'ఎందుకిలా అతనికోసం అతని పరిచయం కోసం వెంపర్లాడుతోంది తను, పరిచయం పెరిగాకా ఏం చేస్తుంది? మాట్లాడుతూ...మౌనంగా మనసులోనే అతన్ని ఆరాధిస్తూ మూగగా ఉండిపోతుందా! లేక అందరి కళ్ళూ గప్పి హద్దులు దాటి ఇంకెంత దూరమైనా వెళ్ళిపోతుందా?

అతనికి సంబంధించిన ఆలోచనల్లో తన గమ్యం ఏమిటి?

ఎందుకిలా ఆలోచిస్తోంది?

అసలు తనకేమైంది?' అనుకుంది.

అంతా అయోమయంగా అనిపించింది. తల విదిలించింది.

ఎదురుగా మళ్ళీ భర్త కనిపించాడు.

ఆ క్షణంలోనే మళ్ళీ స్కూల్లో ఉన్న అతను గుర్తొచ్చాడు.

గుండె పగిలినట్టయింది. ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకడం మొదలెట్టాయి.

"నా మనసు ఎందుకిలా అదుపుతప్పింది?" తనని తాను ప్రశ్నించుకుంది.

జవాబు దొరకలేదు. "ఇన్నాళ్ళూ గుర్తురాని ఈ వాస్తవం హఠాత్తుగా ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చింది? ' అనుకుంది.

ఎదురుగా మళ్ళీ భర్త కనిపించాడు.

"అంటే..స్కూల్ నుంచి ఇంటికి రాగానే ఎదురుగా భర్త కనిపించి ఉంటే తను అతని గురించి ఆలోచించడం మానేసేదా?" అనుకుంది.

అలా అనుకోవడం ఎందుకో ఆమెకే సబబుగా అనిపించలేదు.

"అది కాదు సంగతి..మెళ్ళో ఉన్న మంగళసూత్రాల్నీ, పక్కనున్న పసివాణ్ణీ మర్చిపోయి మరీ తను అతని మీద ఆసక్తి పెంచుకుందంటే అందుకు మనసు కళ్ళేల్ని వదిలేయడమే సరైన కారణం! అసలు తప్పంతా తనదే! నిజమే..కంటికి ఎదురుగా ఎన్నెన్నో కనిపిస్తాయి. వాటిలో చాలా వరకూ మనకి నచ్చేవే! అంతమాత్రాన చూసిన ప్రతిదానిమీద మనసు పారేసుకుని దాన్ని సొంతం చేసుకోవాలనుకోవడం ప్రమాదమే! ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాట్లు జరగనివ్వకూడదు. ముఖ్యంగా మనసు విషయంలో..'' ఆమె ఆలోచనలలా సాగిపోతూనే ఉన్నాయి.

ఇంతలో...

"టైమవుతోంది. బాక్స్ రెడీ చెయ్యమంటే చెయ్యకుండా ఏవిటా వెర్రిచూపులు? ఏమైంది నీకు?" భర్త మందలింపుతో ఆమె ఆలోచనలు ఆగిపోయాయి.

"నాకు పిచ్చెక్కింది..." ఠక్కున అంది.

"ఆ!" అయోమయంగా నోరు తెరిచాడు తను, ఆమె అంటున్నదేవిటో అర్థం కాక!

తన మాటల్లోని పొరపాటు తెలిసిందామెకి. నాలుక్కొరుచుకుని..క్షణంలో సర్దుకుంది.

"అదే..పిచ్చెక్కుతోంది..ఇంటెడు పనీ చేసి మళ్ళీ వాణ్ణి స్కూల్‌కి తీసుకెళ్ళి దింపిరావడం, తీసుకురావడం నాకు చాలా కష్టంగా ఉంటోంది. ఇంత చాకిరీ నేను చెయ్యలేను. రేపట్నుంచీ బాబిగాణ్ణి స్కూల్‌కి తీసుకెళ్ళి దించే బాధ్యత మీదే. ఇక నేను ఛస్తే ఆ ఛాయలకి వెళ్ళను. గుర్తుంచుకోండి." చెప్పేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

సమస్యని తనే సృష్టించుకుంది. అది తప్పని తెలుసుకుంది. దానికి పరిష్కారమూ తనే వెతుక్కుంది.

ఇప్పుడు ఇంద్రాణి మనసు తేలిగ్గా ఉంది.

నిజమే! మనసుని అదుపులో ఉంచుకోగలిగితే ఏదీ సమస్య కాదు మరి!

★

